## జన్మభూమి

ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము.

## వరిచేలు పండాలి

వానల్లు కురవాలి - వానదేముడా
వరిచేలు పండాలి - వానదేముడా
నల్లని మేఘాలు - వానదేముడా
చల్లగా కురవాలి - వానదేముడా

మావూరి చెరువంత - వానదేముడా
మునిగెత్తి పోవాలి - వానదేముడా
కప్పలకు పెండ్లిండ్లు - వానదేముడా
గొప్పగా చేస్తాము - వానదేముడా
పచ్చగా చేలంత - వానదేముడా
పంటల్లు పండాలి - వానదేముడా
వానల్లు కురవాలి - వానదేముడా
వరిచేలు పండాలి - వానదేముడా.

## చిట్టి చిట్టి చెల్లెమ్మా !

చిట్టి చిట్టి చెల్లెమ్మా -
పలకా బలపం తేవమ్మా
అక్షరాలు నేర్వమ్మా
చదువు బాగా నేర్వమ్మా
తెలివిని బాగా పెంచమ్మా
ఇంటికి పేరు తేవమ్మా.

## పలక

పలక నీది నల్లన
పైన రాతి తెల్లన
అ ఆ ఇ ఈ రాశారు
అమ్మ ముందు పెట్టారు
అమ్మ లడ్డు ఇచ్చింది.
ఆనందంగా తిన్నారు.

## ఒకటి రెండు మూడు

ఒకటి ఒకటి ఒప్పులకుప్ప
రెండు రెండు రెక్కల పక్షి
మూడు మూడు ముక్కాలి పీట
నాలుగు నాలుగు మా ఆవు కాళ్ళు
అయిదు అయిదు నా చేతి వేళ్ళు.

## భారతభూమికి జేజే

అమ్మకు జేజే
నాన్నకు జేజే
బంగరు భారత భూమికి జేజే.
చదువులు నేర్పే గురువుకు జేజే.

## తప్పెట్లోయ్ తాళాలోయ్

తప్పెట్లోయ్ తాళాలోయ్
దేముడి గుళ్ళో బాజాలోయ్
పప్పు బెల్లం దేముడికోయ్
పాలు నెయ్యి పాపడికోయ్.

## బావా ! బావా ! పన్నీరు

బావా ! బావా ! పన్నీరు
బావను పట్టుకు తన్నీరు
వీధి వీధి తిప్పేరు
వీసెడు గంధం పూసేరు
బావని గుంజకు కట్టేరు
చప్పెడి గుద్దులు గుద్దేరు.

పట్టిమంచం వేసేరు.
పాతిక గుద్దులు గుద్దేరు
నులక మంచం వేసేరు.
నూరు గుద్దులు గుద్దేరు.

## బుర్రుపిట్ట

బుర్రుపిట్ట బుర్రుపిట్ట తుర్రుమన్నది
పడమటింటి కాపురము చేయనన్నది.
అత్తతెచ్చిన కొత్త చీర కట్టనన్నది.
మామ తెచ్చిన మల్లెపూలు ముడువనన్నది
మొగునిచేత మొట్టికాయ తింటానన్నది.

## ఏనుగమ్మ ఏనుగు

ఏనుగమ్మ ఏనుగు
ఏ వూరెళ్ళిందే నుగు
మా రెళ్ళిందే నుగు
మంచినీళ్ళు తాగిందే నుగు
ఏనుగమ్మ ఏనుగు.

ఏనుగు ఏనుగు నల్లన
ఏనుగు కొమ్ములు తెల్లన
ఏనుగు మీద రాముడు
ఎంతో చక్కని దేముడు.

## చిట్టి చిట్టి మిరియాలు

చిట్టి చిట్టి మిరియాలు
చెట్టు కింద పోసి
పుట్టమన్ను తెచ్చి
బొమ్మరిల్లు కడితే
బొమ్మరింట్లో పాప పుట్టె.

## చేత వెన్నముద్ద

చేత వెన్నముద్ద
చెంగల్వ పూదండ
బంగారు మొలతాడు
పట్టుదట్టి

సందె తాయెతులు
సరిమువ్వ గజ్జెలు
చిన్ని క్రిష్ణా నిన్ను
చేరి కొలుతు.

## చుక్ చుక్ రైలు

చుక్ చుక్ రైలు వస్తోంది
దూరం దూరం జరిగండి.
ఆగగానే ఎక్కండి.
జోజో పాపా ఏడవకు
నాన్నగారు వస్తారు
లడ్డు మిఠాయి తెస్తారు
నీకు నాకు ఇస్తారు.

## చిట్టి చిలకమ్మా

చిట్టి చిలకమ్మా
అమ్మ కొట్టిందా

తోట కెళ్ళేవా?
పండు తెచ్చావా ?

గూట్లో పెట్టావా ?
గుటుక్కు మన్నావా ?

## ఒప్పులకుప్ప

ఒప్పులకుప్ప
ఒయ్యారి భామ

సన్న బియ్యం
చాయ పప్పు

చిన్నిమువ్వ
సన్నగాజు

కొబ్బరికోరు
పాకం పప్పు

గూట్లో రూపాయి
గుటుక్కు మన్నాయి.

## దాగుడు మూతలు

దాగుడు మూతలు దండాకోర్
పిల్లివచ్చె ఎలకా భద్రం
ఎక్కడి దొంగలు అక్కడే
గప్ చిప్...గప్ చిప్

కళ్ళు మూసి కోలికోల్
ఎక్కడి దొంగలు అక్కడే
అణుక్కో ముణుక్కో దాక్కో
గప్ చిప్...గప్ చిప్.

## తారంగం తారంగం

తారంగం తారంగం
తాండవ కృష్ణా తారంగం.

వేణూనాధా తారంగం
వెంకటరమణ తారంగం

వెన్నల దొంగా తారంగం
చిన్నీ కృష్ణా తారంగం.

## వారములు

ఆదివారము నాడు అరటి మొలచినది
సోమవారము నాడు సుడివేసి పెరిగినది
మంగళవారము నాడు మారాకు తొడిగినది
బుధవారము నాడు పొట్టిగెల వేసినది
గురువారము నాడు గుబురుగా దాగినది
శుక్రవారము నాడు చూడగా పండినది
శనివారము నాడు చక చకా గెలకోసి
అందరికి పంచితిమి అరటి అత్తములు.

## చెమ్మ చెక్క

చెమ్మ చెక్క - చారడేసి మొగ్గ
అట్లుపోయంగ - ఆరగించంగ

ముత్యాల చెమ్మచెక్క - ముగ్గులేయంగ
రత్నాల చెమ్మచెక్క - రంగులేయంగ

పగడాల చెమ్మచెక్క - పందిరేయంగ
పందిట్లో రామయ్య - పెండ్లి సేయంగ

సీతమ్మ సిగ్గంత - సింది పోవంగ
చూసి వత్తం రండి - పూలేసి వత్తము రండి.

## చందమామ రావే

చందమామ రావే జాబిల్ల రావే
కొండెక్కి రావే కోటిపూలు తేవే

బండెక్కి రావే బంతిపూలు తేవే
తేరుమీద రావే తేనెపట్టు తేవే

పల్లకిలో రావే పాలు పెరుగు తేవే
పరుగెత్తి రావే పనస పండు తేవే

అలయకుండా రావే అరటిపండు తేవే
అన్నిటిని తెచ్చి అబ్బాయికివ్వవే.

## కాళా గజ్జ కంకాళమ్మా

కాళా గజ్జ కంకాళమ్మా
    వేగు చుక్క వెలగ మొగ్గ
మొగ్గ కాదు, మోదుగ నీరు
    నీరు కాదు నిమ్మల బావి
బావి కాదు బచ్చలి పండు
    పండు కాదు పాపాయి కాలు
కాలు తీసి పక్కన పెట్టు.

## చెన్నా పట్నం చెరుకు ముక్క

చెన్నా పట్నం చెరుకు ముక్క
నీకో ముక్క నాకో ముక్క

    భీముని పట్నం బిందెల జోడు
    నీకో బింది నాకో బింది

కాశీపట్నం - కాసుల పేరు
నీకో కాసు - నాకో కాసు.

## ఏ ఇల్లు మేలు

ఇళ్ళల్లోకెల్ల ఏ ఇల్లు మేలు
శ్రీ లక్ష్మి నివసించు మా ఇల్లు మేలు

వీధులలో కెల్ల ఏ వీధి మేలు ?
విద్వాంసులున్నట్టి మా వీధి మేలు

అరుగులలోకెల్ల ఏ అరుగు మేలు ?
పండితులు కూర్చునే మా అరుగు మేలు

తోటలలోకెల్ల ఏ తోట మేలు?
మామిడి చెట్లున్న మా తోట మేలు.

## అమ్మణ్ణి

గంధం మెడకు పూసుకొని
పసుపు కుంకుమ రాసుకొని
కంటికి కాటుక పెట్టుకొని
ఆడవే ఆడవే అమ్మణ్ణి
పువ్వులు తలలో ముడుచుకొని
తిలకం నుదుట దిద్దుకొని
బుగ్గను చుక్కా పెట్టుకొని
ఆడవే ఆడవే అమ్మణ్ణి